E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :66 శుక్రవారం 07 ఆగష్టు 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## రెండు నిమిషాలు చాలు.. అరాచకాలు అరికట్టేస్తాం



రెండు నిమిషాలు చాలు అరాచకాలకు చెక్

వైసీపీ నేతలపై చంద్రబాబు తీవ్ర విమర్శలు

డీఎస్పీపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచన

అక్రమాలు జరగలేదని సీఎం స్పష్టీకరణ

కోర్టు వ్యాఖ్యలను గుర్తుచేసిన చంద్రబాబు

జగన్ పరామర్శలపై సీఎం ఎద్దేవా వ్యాఖ్యలు

2 లో

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

అసెంబ్లీ షెడ్యూల్ ఖరారు

అమరావతికి గ్రీన్ సిగ్నల్

కొత్త పాలసీలకు ఆమోదం

దిశా బిల్లు ఉపసంహరణ

పుష్కర ఘాట్లకు నిధులు

పారిశ్రామికాభివృద్ధిపై ఫోకస్



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి కేబినెట్ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన మూడున్నర గంటలకు పైగా సుదీర్ఘంగా సాగిన ఈ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక అభివృద్ధి పనులు, కొత్త పాలసీలు, చట్ట సవరణలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అలాగే ఏపీ వర్షాకాల అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు చేసింది.

ఎల్ అండ్ టీ కి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్

అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి రూ. 1,002.49 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలపడమే కాకుండా, ఈ నిర్మాణ బాధ్యతలను ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే రాష్ట్ర అసెంబ్లీ, హైకోర్టుల ఐకానిక్ భవనాల డిజైన్ల పూర్తి కోసం అదనపు నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. అమరావతిలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ ఆమోదించడంతో పాటు, అమరావతి ఐ ప్రాజెక్టుకు తిరిగి టెండర్లు (రీ-టెండర్లు) పిలిచేందుకు నిర్ణయించింది.

2 లో

## కేటీఆర్‌పై ఏసీబీ కీలక చర్య

75 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన ఏసీబీ

కేటీఆర్‌తో పాటు నలుగురిపై అభియోగాలు

రూ.46.82 కోట్ల చెల్లింపులపై దర్యాప్తు వివరాలు

ఎలక్టోరల్ బాండ్లపై క్విడ్ ప్రోకో కోణం ప్రస్తావన

ఐపీసీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసులు

ఫార్ములా ఈ-రేసింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

రూ.600 కోట్ల నష్టం ఆరోపణలు

క్విడ్ ప్రోకో కోణంపైనా ప్రస్తావన

2 లో

## క్యా బోల్తీ పబ్లిక్”తో దేశవ్యాప్త పోరు

నిరుద్యోగంపై సీజేపీ జాతీయ యుద్ధం

దేశ రాజకీయాలపై సీజేపీ ఫోకస్

ప్రజలే అజెండా.. సీజేపీ ప్లాన్

నిరుద్యోగమే జాతీయ అజెండా

జంతర్ మంతర్ నుంచి దేశవ్యాప్తంగా

సీజేపీ నెక్స్ట్ టార్గెట్ దేశమే



2 లో

## స్థానిక ఎన్నికలపై ఫోకస్

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే పూర్తి సన్నద్ధం

మంత్రులకు నారా లోకేష్ కీలక దిశానిర్దేశం

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు వివరించాలి

కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యమన్న లోకేష్

అసెంబ్లీ వ్యూహంపై మంత్రులతో విస్తృతంగా చర్చ

ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

2 లో

## విభేదాలకు తెర.. అధ్యక్షుల ప్రకటన

కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్‌కు కొత్త అధ్యక్షుల నియామకం

సాయి మల్లేశం, యూ.రమేశ్, గిరివర్ధన్ రెడ్డికి బాధ్యతలు

పెండింగ్‌లో ఉన్న నియామకాలకు ఎట్టకేలకు ముగింపు

రామచందర్ రావు ప్రకటించిన జిల్లా అధ్యక్షులు

సయోధ్య తర్వాత ఖరారైన నియామకాలు


ఇరు వర్గాల అంగీకారంతో తుది జాబితా

మూడు జిల్లాల్లో సంస్థాగత మార్పులు

బీజేపీ జిల్లా కమిటీల్లో కీలక మార్పులు

2 లో

## ఎల్‌నినో మరింత ఉధృతం



2 లో

ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో మరింత ఉధృతం

తక్కువ వర్షాలతో తేమ కొరత హెచ్చరిక

ఐరోపాను దహిస్తున్న వడగాలులు, కార్చిచ్చులు

అమెరికాలోనూ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

## అస్సాంలో వరద బీభత్సం



2 లో

అస్సాంలో వరదలతో 95 మంది మృతి

25 జిల్లాల్లో వరదల తీవ్ర ప్రభావం

1.22 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు

365 గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే

15 వేల ఎకరాల పంటలకు నష్టం

మళ్లీ భారీ వర్షాలపై ఐఎండీ హెచ్చరిక

# స్మార్ట్ కార్డుల శంఖారావం




- ఆగష్టు 15 నుంచి స్మార్ట్ కార్డుల జారీ
- 1.05 కోట్ల మందికి భారీ లబ్ధి
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 119 నియోజకవర్గాల్లో ఏకకాల పంపిణీ
- పీవీసీ కార్డులతో ఆధునిక భద్రత
- క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ గుర్తింపు
- ఈ-కేవైసీ పూర్తి.. పంపిణీకి సిద్ధం
- సంక్షేమ పాలనలో మరో కీలక అడుగు

**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (తెలుగు గళం):** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంశుభవార్త చెప్పింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుండగా.. అదే రోజు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు.

మిగతాది 2 లో..

## బట్టకాల్చి మీదేస్తే ఊరుకునేది లేదు

కాంగ్రెస్‌కు హరీశ్ వార్నింగ్

క్షుద్రపూజల ఆరోపణలపై ఫైర్

పరువు నష్టం కేసులు

30 రోజుల గడువు

డైవర్షన్ పాలిటిక్స్ ఆరోపణ

ప్రభుత్వ వైఫల్యాల ప్రస్తావన



2 లో

**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## గోబర్ధన్‌కు కేబినెట్ ఆమోదం

రూ.23,731 కోట్ల పథకం

స్వచ్ఛ ఇంధనానికి ఊతం

రైతులకు కొత్త అవకాశం

అస్సాం కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (తెలుగు గళం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు, పథకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలిచే ‘గోబర్ధన్’ (నేషనల్ సర్క్యులర్ బయోఎనర్జీ స్కీమ్) పథకానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.23,731 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేసిన ఈ పథకం, 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి 2035-36 ఆర్థిక సంవత్సరం వరకు పదేళ్ల పాటు అమలు కానుంది. దేశంలో సమృద్ధిగా లభించే వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ప్రెస్ మడ్, పురపాలక సేంద్రీయ వ్యర్థాలను పరిశుభ్రమైన ఇంధనంగా, సేంద్రీయ ఎరువులుగా మార్చడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. భారత భవిష్యత్ ఇంధన అవసరాల్లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ను ..

2 లో

## కేటీఆర్‌పై ఏసీబీ కీలక చర్య




**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** ఫార్ములా ఈ-రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ 75 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాపై రూ.600 కోట్ల భారం మోపేలా నేరపూరిత కుట్ర పన్నారని ఆరోపించింది. ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్‌లను నిందితులుగా చేర్చింది. కేబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండా నిర్ణయాలు తీసుకున్నారని ఏసీబీ పేర్కొంది. ప్రమోటర్ సంస్థ అనుబంధ కంపెనీల నుంచి బీఆర్ఎస్‌కు రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు అందాయని, దానికి ప్రతిఫలంగా రేసింగ్ బాధ్యతలు అప్పగించారనే క్విడ్ ప్రోకో కోణాన్ని ఏసీబీ ప్రస్తావించింది. హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.46.82 కోట్లు చెల్లించారని, కేటీఆర్‌పై ఐపీసీ 409, 120బీతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది.

## బట్టకాల్చి మీదేస్తే ఊరుకునేది లేదు

మొదటి పేజీ తరువాయి

గురువారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో కూడా రాష్ట్రంలో వర్షాలు కురవద్దంటూ తాను క్షుద్రపూజలు చేశానని కాంగ్రెస్ నేతలు తనపై నిందలు వేయడం సిగ్గుచేటని అన్నారు. రాజకీయాల్లో విమర్శలకు కూడా ఓ హద్దంటూ ఉంటుందని.. ఏదిపడితే అది బట్టకాల్చి మీదేస్తే తాను ఊరుకునే రకం కాదని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరీశ్ రావు మాస్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే..

గతంలో కూడా మంత్రి కొండా సురేఖ ఇలాగే నోటికొచ్చినట్లుగా మాట్లాడి గురువారం నాంపల్లి కోర్టు చుట్టూ తిరుగుతూ ఉన్నారని హరీశ్ రావు అన్నారు. క్షుద్రపూజల ఆరోపణ అంశంలో ఇష్టం వచ్చిన మాట్లాడిన కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ సూట్, పరువు నష్టం కేసును వేయబోతున్నానని.. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చానని అన్నారు. మెయిన్ లీగల్ యాక్షన్‌కు ఇంకా 30 రోజుల టైమ్ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పిదాలు, స్కాములను ఎత్తిచూపుతున్న నేపథ్యంలోనే రాజకీయంగా ఎదుర్కోలేక తనపై బురదజల్లేందుకు, డైవర్షన్ పాలిటిక్స్ కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మైనింగ్ స్కామ్, నాదర్‌గుల్ భూముల వ్యవహారం, గురుకుల టెండర్ల అవినీతి బయటపెట్టామనే ఆక్రోశంలో ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతాంగం నీళ్లు లేక అల్లాడుతుంటే.. దేవాదులలో 10 మోటార్లు ఉన్నా.. నేటికీ 4 మోటార్లు మాత్రమే నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రజల హక్కులు, రైతాంగం, విద్యార్థుల పక్షాల తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని.. తగ్గేదేలేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## విభేదాలకు తెర.. అధ్యక్షుల ప్రకటన



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ భారతీయ జనతా పార్టీ లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్షుల నియామకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ.రమేశ్ , మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి లను నియమించారు.

అయితే, ఈ మూడు జిల్లాల అధ్యక్షుల ఎంపిక విషయంలో పార్టీ కీలక నేతలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ నడుమ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. తమ వర్గానికి చెందిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు నేతలు పట్టుబట్టడంతో గత కొంతకాలంగా సదరు నియామకాలను పార్టీ నాయకత్వం హోల్డ్‌లో పెట్టింది. ఇటీవల ఇరువురి నేతల మధ్య విస్తృత చర్చలు జరిగి సయోధ్య కుదరడంతో, అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన పేర్లను ఖరారు చేస్తూ రాష్ట్ర అధినాయకత్వం తుది నిర్ణయం తీసుకున్నది.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పలు కొత్త పాలసీలను ఆమోదించింది. పరిశ్రమలకు అనుకూల వవాతావరణం కోసం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్ - 2026'తో పాటు 'ఏపీ పీపీపీ పాలసీ - 2026' ముసాయిదాకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రోడ్డు భద్రతలో భాగంగా ప్రత్యేకంగా 'పాదచారుల భద్రత పాలసీ 2026'ను, విశాఖపట్నంలో మురికివాడల సమగ్ర అభివృద్ధి కోసం నూతన పాలసీని రూపొందించేందుకు ఆమోదముద్ర వేసింది. మున్సిపల్ భూముల లీజు గడువును పెంచేలా సంబంధిత చట్ట సవరణల ప్రతిపాదనలను ఓకే చేయడంతో పాటు, రాష్ట్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు వాటి పునర్వ్యవస్థీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

న్యాయపరమైన సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన దిశా బిల్లు - 2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు - 2024లను ఉపసంహరించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ప్రజల భద్రత, భూముల రక్షణే ధ్యేయంగా వీటి స్థానంలో మరింత పటిష్ఠమైన, సమర్థవంతమైన కొత్త చట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది.

పారిశ్రామికాభివృద్ధి, టెలికాం రంగ విస్తరణపై మంత్రివర్గం ప్రత్యేక దృష్టి సారించింది. టెక్స్‌టైల్స్ పాలసీలోని వేతన సబ్సిడీ నిబంధనలకు సవరణలు చేయడంతో పాటు, కొత్తగా వచ్చే పారిశ్రామిక ప్రాజెక్టులకు మౌలిక సదుపాయాల కల్పనకు అనుమతులు ఇచ్చింది. డిజిటల్ కనెక్టివిటీ పెంచేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూముల కేటాయింపు, రాయితీ విద్యుత్ అందించేందుకు ఆమోదం తెలిపింది. పారిశ్రామిక అవసరాల కోసం స్థలాలను కొనుగోలు చేయాలని ఏపీఐఐసీ ని ఆదేశించింది. అలాగే తీవ్ర నష్టాల్లో ఉన్న మూడు సహకార చక్కెర కర్మాగారాలను లిక్విడేషన్ చేయడానికి నిర్ణయం తీసుకుంది.

విద్య, ఆధ్యాత్మిక రంగాలు, ఉద్యోగ కల్పనకు సంబంధించి పలు ప్రాధాన్యత నిర్ణయాలు తీసుకుంది. విద్యారంగ విస్తరణలో భాగంగా రాష్ట్రంలో రెండు కొత్త ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు, నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో విద్యాపాలన వేగవంతం చేసేందుకు 15 కొత్త డీఈఓ పోస్టుల సృష్టికి పచ్చజెండా ఊపింది. మరోవైపు త్వరలో రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం రూ.210.06 కోట్లతో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసింది.

ఇక.. ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల షెడ్యూల్‌ను కేబినెట్ ఖరారు చేసింది. ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు కీలక సామాజిక, ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలపై ఈ సమావేశాల్లో కూలంకషంగా చర్చించనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై ఫోకస్



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** కేబినెట్ సమావేశానికి ముందు రాష్ట్ర మంత్రులతో మంత్రి నారా లోకేష్ నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ వ్యూహం, ప్రజా సమస్యలు, ఎల్‌నినో పరిస్థితులు వంటి కీలక అంశాలపై చర్చించారు. అనుకున్న సమయానికే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని మంత్రులకు మంత్రి లోకేష్ సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాలను గెలుచుకునేలా ప్రతి మంత్రి, ప్రజాప్రతినిధి క్షేత్రస్థాయిలో పని చేయాలని మంత్రి నారా లోకేష్ సమావేశంలో చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన తీరును ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద కనీసం మూడు నిమిషాలైనా గడుపుతూ ప్రభుత్వ పనితీరు, అమలు చేసిన కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి చర్యలను ప్రజలకు వివరించాలని లోకేష్ మంత్రులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు.

అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపైనా సమావేశంలో నారా లోకేష్ మంత్రులతో చర్చించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమగ్రంగా వివరించాలని సూచించారు. ఇటీవల జలాశయాల్లోకి వరద నీరు రావడం కొంత ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ, నీటి వినియోగంలో జాగ్రత్త అవసరమని అన్నారు. నీటి నిర్వహణలో తొలి ప్రాధాన్యాన్ని తాగునీటి అవసరాలకు, ద్వితీయ ప్రాధాన్యాన్ని పశుగ్రాసం, పశుసంవర్ధక అవసరాలకు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు.

## గోబర్ధన్‌కు కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఒక ప్రధాన స్తంభంగా నిలబెట్టేందుకు, దేశీయ సీబీజీ ఉత్పత్తిని ఏకంగా పదింతలు పెంచి పటిష్ఠమైన సర్క్యులర్ బయో ఎకానమీని సృష్టించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. "భారత వ్యర్థాలే దేశాభివృద్ధికి ఇంధనం.. గ్రామాలే స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి కేంద్రాలు.. రైతులే ఇంధన భద్రతలో భాగస్వాములు" అనే స్పష్టమైన విజన్‌తో కేంద్ర ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్తోంది.

అలాగే.. అస్సాంలో జాతీయ రహదారి-15 పరిధిలోని 135.871 కిలోమీటర్ల పొడవైన 4-లేన్ యాక్సెస్-కంట్రోల్డ్ గువాహాటి-తేజ్‌పూర్ కారిడార్ అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఎన్హెచ్-ఓ పథకం కింద బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ టోల్ మోడ్‌లో మొత్తం రూ. 8,970.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తేజ్‌పూర్ బైపాస్‌లో 4.9 కిలోమీటర్ల మేర అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని భారత వైమానిక దళంతో సమన్వయం చేసుకుని నిర్మిస్తారు. ఇది బ్రహ్మపుత్ర నదికి దక్షిణాన ఉన్న ప్రస్తుత ఎన్హెచ్-27 (ఈస్ట్ వెస్ట్ కారిడార్) పై వాహనాల రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది. బైహాత చరియాలీ, సిపాఝార్, ఖరుపేటియా, దేకియాజులి, తేజ్‌పూర్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులను నివారించడానికి 58.7 కిలోమీటర్ల మేర 5 ప్రధాన బైపాస్‌ల నిర్మాణాన్ని కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేర్చారు.

## ఎల్‌నినో మరింత ఉధృతం..

**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** సూపర్ ఎల్ నినో ప్రభావం రానున్న నెలల్లో మరింత ఉధృతం కానున్నది. ఆగస్టులో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమై అక్టోబర్ వరకు కొనసాగుతాయని నిపుణులు తెలిపారు. రానున్న వారాల్లో ఎల్ నినో తీవ్రతరం కావడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐక్యరాజ్యసమితి ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) పేర్కొంది. భారత్‌లో ఈ రుతుపవన కాలంలో వర్షపాత తీరును ప్రభావితం చేసే ప్రధాన కారకం ఎల్ నినో. రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటు(ఎల్‌పీఏ)లో సుమారు 92 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండే సీజన్‌ను సూచిస్తున్నది. మధ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, వాయువ్య భారత్‌లోని కొన్ని భాగాలు తేమ కొరత ప్రమాదంలో ఉన్నాయి. ఈశాన్యంలోని అస్సాం గత కొన్నేండ్లలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన వరదలతో పోరాడుతున్నది.

నిప్పుల కొలిమిలా ఐరోపా

ఎల్ నినో ప్రభావంతో ఐరోపా ఇప్పటికే అనేక వడగాలులను చవిచూసింది. భారత్‌లో రుతుపవన చక్రం దెబ్బతినగా ప్రపంచంలోని అనేక ఇతర ప్రాంతాలు తీవ్ర ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింత ఉగ్రరూపం దాల్చనున్నది. ఎల్ నినో కేవలం మన గుమ్మం వద్దే లేదు. అది మన ఇంటి లోపలకు వచ్చి ఉష్ణోగ్రతలను పెంచుతున్నది అని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే అని హెచ్చరించిన ఆయన ఎల్ నినో మరింత బలపడుతున్నది. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, వినాశకరమైన కార్చిచ్చులు, రికార్డు స్థాయి సముద్రపు వేడితో అట్టుడికిపోతున్న భూమికి ఇది మరింత ఆజ్యం పోస్తున్నది అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐరోపా అంతా ఒక నిప్పుల కొలిమిలా మారిపోయింది. ఫ్రాన్స్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్ద ప్రాంతాలను కార్చిచ్చులు చుట్టుముట్టాయి. బోర్డోలో చెలరేగిన ఒక భారీ అగ్నిప్రమాదం కారణంగా మెరుపులు, ఉరుములతో నిండిన ఒక మేఘం ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత తీవ్రమైన అగ్నిప్రమాద సంక్షోభంగా పేర్కొంటూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్

మాక్రాన్ అత్యవసర పరిస్థితిని ప్రకటించడంతో 2 లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. డెన్మార్క్, జర్మనీ, పోలాండ్ దేశాలు కూడా అత్యధిక ఉష్ణోగ్రతలను నమోదు చేశాయి. జూలై చివరి నాటికి యూరోపియన్ యూనియన్ వ్యాప్తంగా 4.35 లక్షల హెక్టార్లకు పైగా భూమి అగ్నికి ఆహుతైంది. దీంతో ఇది రికార్డు స్థాయిలో అత్యంత తీవ్రమైన అగ్ని ప్రమాద కాలాలలో ఒకటిగా నిలిచింది.

మండుతున్న అమెరికా

అమెరికాలో కూడా అధిక ఉష్ణోగ్రతలు, వేడి పరిస్థితులు నెలకొన్నాయి. ఉటాలోని సాల్ట్ లేక్ సిటీలో ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఉత్తర కరోలినాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. పశ్చిమ, గ్రేట్ ప్లెయిన్స్ ప్రాంతాలను తీవ్రమైన వడగాలులు చుట్టుముట్టగా దక్షిణ, మధ్య ప్రాంతాలలో ఈ సీజన్ ఆరంభంలోనే తీవ్రమైన కరువు ఏర్పడింది. కొలరాడో, ఇడాహూ, మోంటానా, నెవాడాలలో వేసవిలో పిడుగుపాట్లు, అగ్నిప్రమాదాలు సంభవించాయి.

## అస్సాంలో వరద బీభత్సం..



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** అస్సాంలో వరదలు బీభత్సం సృష్టించాయి. ఈ వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 95 కి చేరింది. ఈ వరదలవల్ల రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాలపై తీవ్ర ప్రభావం పడింది. చాలా ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పడుతున్నప్పటికీ ఇప్పటికీ 365 కిపైగా గ్రామాలు నీట మునిగే ఉన్నాయి. సుమారు 1.22 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా 15 వేలకుపైగా ఎకరాల్లో పంట భూమి దెబ్బతిన్నది.

విపత్తు తీవ్రతను పరిశీలించేందుకు అస్సాం సీఎం హిమాంత కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మరోవైపు పొరుగు రాష్ట్రాలైన మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లలో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దాంతో అస్సాంలో మళ్లీ వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## క్యా బోల్తీ పబ్లిక్"తో దేశవ్యాప్త పోరు



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** నీట్ పేపర్ లీక్ పై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులతో 36 రోజులపాటు నిరసనలు చేసి.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించి విజయం సాధించిన సీజేపీ ప్రతినిధులు తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. సెప్టెంబర్ లో "క్యా బోల్తీ పబ్లిక్" పేరిట జాతీయస్థాయిలో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇందులో నిరుద్యోగాన్నే ప్రధాన సమస్యగా తీసుకుని.. దానినే జాతీయ అంశంగా మారుస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా సమస్యలను తెలుసుకునేలా ఈ కార్యక్రమం ఉండబోతోందన్న సీజేపీ ప్రతినిధులు.. త్వరలోనే రాంచీ వెళ్లనున్నారు.

మహారాష్ట్రలోని తన స్వగ్రామం ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన సీపీజేపీ కోర్ టీమ్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రచారంలో విద్యా రంగానికి కూడా ఇస్తున్నట్లు దీప్కే వెల్లడించారు. దేశంలో బడి, కళాశాలలు, కోచింగ్ ఫీజులు విపరీతంగా పెరిగిపోయాయని, మొదటి తరగతి చదువుకే రూ.1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తూ విరాళాల పేరుతో అదనంగా దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. సాధారణ, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్య అందుబాటులో లేకుండా పోయిందని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం విద్య అనేది ప్రాథమిక హక్కు అని, కానీ గత కొన్నేళ్లుగా దాన్ని కొందరు వ్యాపారంగా మార్చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఇటీవల జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కేవలం నీట్ లేదా విద్యా వ్యవస్థకు మాత్రమే పరిమితం కాలేదని, అది ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర ఆగ్రహానికి నిదర్శనమని దీప్కే పేర్కొన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం కోల్పోతున్నారని, గెలిచిన నాయకులు పార్టీలు మారడం సాధారణమైపోయిందని దుయ్యబట్టారు. న్యాయ వ్యవస్థ తటస్థతపై కూడా ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల కోర్టులు ఇస్తున్న తీర్పులు అధికార పక్షాలకే అనుకూలంగా ఉంటున్నాయని, బడా వ్యాపారవేత్తలకు, రాజకీయ పార్టీల చీలికలు లేదా ఎమ్మెల్యేల చేరికల వివాదాలకు త్వరితగతిన విచారణ జరిపి తీర్పులు ఇచ్చే న్యాయస్థానాలు, సాధారణ పౌరుడు న్యాయం కోసం వస్తే మాత్రం ఏళ్ల తరబడి వాయిదాలు వేస్తున్నాయని ఆరోపించారు. సాధారణ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందకపోవడం కోర్టుల సమగ్రత, పారదర్శకతపై పెద్ద ప్రశ్నార్థకంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.

## రెండు నిమిషాలు చాలు.. అరాచకాలు అరికట్టేస్తాం



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** రెండు నిమిషాలు చాలని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. డీఎస్సీ పై కావాలని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీలో అక్రమాలు జరగలేదని, కోర్టు చివాట్లు పెట్టినా నానా యాగి చేయడం మాత్రం ఆపడంలేదని ఫైర్ అయ్యారు. డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు. జగన్ పరామర్శలకు వస్తున్నారంటే జనం భయపడే పరిస్థితి ఉందని చంద్రబాబు ఎద్దేవా చేశారు.

## స్మార్ట్ కార్డుల శంఖారావం

మొదటి పేజీ తరువాయి




అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందించనున్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో కార్డులు మంజూరైనా.. భౌతికంగా కార్డులు అందని కుటుంబాలకు కూడా ఈ పంపిణీ ద్వారా ఉపశమనం లభించనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

ఈసారి పంపిణీ చేసే రేషన్ కార్డులను ఆధునిక టెక్నాలజీతో రూపొందించారు. పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసిన లామినేటెడ్ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశారు. వాటర్‌ప్రూఫ్‌గా, క్రెడిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఎక్కువ కాలం ఉపయోగపడేలా తయారు చేశారు.

ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రేషన్ లబ్ధిదారుల తుది జాబితాల పరిశీలన, ఈ-కేవైసీ పూర్తి చేయడం, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో ఉన్న పేద కుటుంబాలకు ఆహార భద్రతను కల్పించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర సంక్షేమ పాలనలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## జగన్ దెబ్బకు చంద్రబాబు 'అవిగన్' అంటున్నారు: మాజీ మంత్రి పేర్ని నాని



**న్యూస్ డెస్క్, 06 ఆగస్టు (తెలుగు గళం):** వైసీపీ అధినేత జగన్ దెబ్బకు సీఎం చంద్రబాబు నాయుడు'అవిగన్' అంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. జగన్ మావిగన్ ప్రాతిపదన తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ అమరావతి, గుంటూరు, విజయవాడను కలిపి రాజధానిగా సీఎం చంద్రబాబు నాయుడు సీఆర్డీఏలో తీర్మానం చేశారని తెలిపారు. దీన్ని రేపో, మాపో కేబినెట్ ముందుకు తీసుకువచ్చి తీర్మానం కూడా చేస్తారని పేర్ని నాని చెప్పారు. అనంతరం అసెంబ్లీలోనూ ప్రవేశ పెడతారని వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో చంద్రబాబు బంధువుల లేరని, అందువల్ల తమ ప్రాంతాన్ని వదిలేశారని పేర్ని నాని వ్యాఖ్యానించారు

# జయశంకర్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి - ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామలో జయశంకర్ విగ్రహ నిర్మాణానికి వ్యక్తిగతంగా పూర్తి ఖర్చు భరిస్తానని హామీ**





తెలుగు గళం న్యూస్ జనగామ, ఆగస్టు 6

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాల అమలుతోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని అధికారులు గుర్తిస్తే, విగ్రహ నిర్మాణం, ప్రతిష్ఠాపనకు అయ్యే మొత్తం ఖర్చును వ్యక్తిగతంగా తానే భరిస్తానని ప్రకటించారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జనగామ పట్టణంలోని 11వ వార్డులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి బలమైన సిద్ధాంతాన్ని అందించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని చారిత్రక, ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాల్లో ప్రజలకు శాస్త్రీయంగా వివరించి ఉద్యమానికి బలమైన పునాది వేశారని కొనియాడారు.తన రచనలు, ప్రసంగాలు, సదస్సుల ద్వారా లక్షలాది మంది యువతలో తెలంగాణ చైతన్యాన్ని నింపారని అన్నారు.వ్యక్తిగత జీవితంలో పదవులు, ఆస్తులు, కుటుంబ ప్రయోజనాల గురించి ఆలోచించకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే జీవిత లక్ష్యంగా నిరాడంబరంగా జీవించిన మహనీయుడు జయశంకర్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.1969 ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూ ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తు చేశారు.తెలంగాణ సమాజంలో ఆత్మగౌరవ భావనను పెంపొందించడంలో జయశంకర్ పాత్ర అపూర్వమని, ఆయన ఆలోచనలు కేవలం ఉద్యమానికే పరిమితం కాకుండా తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి దిక్సూచిగా నిలిచాయని ఎమ్మెల్యే అన్నారు.2001లో ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందిస్తూ ఉద్యమ దిశానిర్దేశంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై జయశంకర్‌కు అపారమైన పట్టు ఉందని, వివిధ ప్రాంతాల పదజాలంపై ఆయన చేసిన అధ్యయనం ఆదర్శనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పాలన కొనసాగాలని పిలుపునిచ్చారు.జనగామ పట్టణంలో జయశంకర్ విగ్రహాన్ని విశిష్టంగా ఏర్పాటు చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు కలిసి తగిన స్థలాన్ని ఎంపిక చేయాలని ఎమ్మెల్యే సూచించారు.జయశంకర్ ఆశయాలు, సిద్ధాంతాలు భావితరాలకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆయనకు అందించే గొప్ప నివాళి అని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.

### విగ్రహానికి పూర్తి ఖర్చు నేనే భరిస్తా- పల్లా

జనగామ పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రకటించారు. విగ్రహ నిర్మాణం, ప్రతిష్ఠాపనకు అయ్యే మొత్తం వ్యయాన్ని వ్యక్తిగతంగా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. స్థల ఎంపికను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి నిర్ణయించాలని సూచించారు.

# స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలి

**గేట్ల వద్ద రైతుల ధర్నా**

**పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన**



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 6

స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం రిజర్వాయర్ నీటి విడుదల గేట్ల వద్ద ధర్నా నిర్వహించారు.వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు కాలువల ద్వారా పంట పొలాలకు నీటిని అందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, బోర్లు, బావులు కూడా పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. చుక్క నీళ్లు లేక చెట్లు ఎండిపోతుండటంతో పాటు పశువులకు తాగునీటి కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న నీటిని వెంటనే కాలువలకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.సాగునీరు ఆలస్యమైతే భారీగా పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని, లేకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,కలెక్టర్ రాహుల్ శర్మ**





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టరేట్ (ఐడీఓసీ) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు,కృషి చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం,దూరదృష్టి,ప్రజల్లో నింపిన చైతన్యం భావితరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడమే ప్రొఫెసర్ జయశంకర్‌కు నిజమైన నివాళి అని,ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కోరారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ... స్వరాష్ట్ర సాధనలో జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.1969 తెలంగాణ ఉద్యమం నుండి ప్రత్యేక రాష్ట్ర సిద్ధించే వరకు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి మార్గనిర్దేశం చేశారని గుర్తుచేశారు.ఆ మహనీయుని త్యాగనిరతిని స్మరించుకుంటూ,సమగ్ర జిల్లా అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతినిధులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,డిఆర్వో వసంత కుమారి,ఆర్డిఓ హరికృష్ణ,మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ కౌన్సిలర్లు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిఆర్ టియు మండల అధ్యక్షులుగా గీరెడ్డి ప్రమోద్ రెడ్డి



స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం, ఆగస్టు 06: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘనపూర్ (స్టే)లో నేడు జరిగిన పిఆర్ టియు టీఎస్ మండల శాఖ సర్వ సభ్య సమావేశంలో మండల అధ్యక్షులుగా మరోకసారి జెడ్పీహెచ్ఎస్ తాటికొండ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గీరెడ్డి ప్రమోద్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా పిఆర్ టియు టీఎస్ ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా గిరెడ్డి సురేష్ కుమార్ మరియు గొట్టెముక్కుల శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. 2026 - 2028 సంవత్సరాలకు గానూ ఎన్నుకున్న నూతన మండల కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా వంగ రఘు గౌడ్, మండల బాధ్యులుగా మధుబాబు, విజేందర్, మంజుల, వెంకటయ్య స్వీకరించారు . ఈ కార్య క్రమంలో రాష్ట్ర బాధ్యులు కె. ప్రకాశం, పిట్టల వెంకటేశ్వర్లు, కె. ప్రవీణ్, భాస్కరరెడ్డి, వి.మురళి,పింగిలి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎలిశెట్టిపల్లిపై తప్పుడు ప్రచారం మానాలి

**అభివృద్ధితోనే కాంగ్రెస్ సమాధానం: చిటమట రఘు**

**బీజేపీ విమర్శలు రాజకీయ లబ్ధికోసమే -- కేంద్రం నిధులు తీసుకురావడంలో ఎందుకు విఫలమైంది?**

**మంత్రి సీతక్క హయాంలో ఎలిశెట్టిపల్లికి అభివృద్ధి, సంక్షేమం -- ప్రజలు వాస్తవాలను గుర్తించాలి**



తెలుగు గళం ఏటూరునాగారం :

ఎలిశెట్టిపల్లి గ్రామంపై ప్రతిపక్ష పార్టీలు, ముఖ్యంగా బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారమేనని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు తీవ్రంగా విమర్శించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో ఏటూరునాగారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఎలిశెట్టిపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. జంపన్న వాగుపై రూ.21 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, సాయిల్ టెస్ట్ పూర్తైందని, వర్షాకాలం ముగిసిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. వరదల సమయంలో గ్రామ ప్రజల రాకపోకలకు బోటు సౌకర్యం కల్పించడం, మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం, సీసీ రోడ్లు, పాఠశాల భవనం, బోర్లు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయడం మంత్రి సీతక్క నాయకత్వంలోనే జరిగాయని పేర్కొన్నారు. త్వరలో అంగన్‌వాడీ టీచర్ నియామకం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. కరోనా మహమ్మారి, వరదలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి సహాయ సహకారాలు అందించిన నాయకురాలు మంత్రి సీతక్క మాత్రమేనని, అలాంటి సేవలను విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కేంద్రంలో ఎన్నో సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ములుగు నియోజకవర్గానికి తీసుకొచ్చిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని చిటమట రఘు సవాల్ విసిరారు. నిజంగా ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే విమర్శలు చేయడం కాకుండా కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి ప్రాంత అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మబోరని, వాస్తవాలను గుర్తించి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి సీతక్క నాయకత్వంలో ములుగు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ నాయకులు ఎండి సిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల నాయకులు గంపల శివకుమార్, శివాలయం చైర్మన్ మడుగురి ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, మాజీ వార్డు సభ్యుడు పడదల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి

**రేగొండలో నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు,ఉద్యమకారులు**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ



తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త,ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రేగొండ మండల కేంద్రంలో గురువారం నివాళు లర్పించారు.మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు,రేగొండ మండల ఉద్యమకారుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్,ఎన్ఎస్ఆర్ అధినేత నాయినేని సంపత్ రావు హాజరై మాట్లాడారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ అందించిన సిద్ధాంత బలం,ఉద్యమానికి చూపిన దిశానిర్దేశం చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన ఆలోచనలు,ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావడమే జయశంకర్ సార్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రేగొండ మండల మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి,రేగొండ మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి,మాజీ ఎంపీటీసీలు పట్టెం శంకర్,మైస భిక్షపతి,ఐలి శ్రీధర్ గౌడ్,అలాగే నాయకులు పసుల అశోక్,గోగుల అశోక్ రెడ్డి,గండి అశోక్,లింగారెడ్డి,గండి తిరుపతి గౌడ్,చెట్ల రమేష్,కట్ల సంజీవరెడ్డి,వెల్దండి అశోక్,ఉద్యమకారులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ ఎంజెపి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ నివాళి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ విజయ నేతృత్వంలో ఉపాధ్యాయినీలు,విద్యార్థినులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు, అందించిన సిద్ధాంతాలు అమూల్యమైనవని కొనియాడారు.విద్యార్థులు ఆయన ఆదర్శాలను,సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.అనంతరం పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు జయశంకర్ సార్ చిత్రపటానికి గౌరవ వందనం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు,సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్‌కు ఘన నివాళి

.. ఏటూరునాగారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

జయశంకర్ ఆశయాల సాధనే నిజమైన నివాళి -- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్ సార్ -- ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు







**తెలుగు గళం ఏటూరునాగారం:**

తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన పునాది వేసిన మహోన్నత మేధావి, ఉద్యమ తాత్వికుడు, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జయశంకర్ సార్ విగ్రహం, చిత్రపటానికి ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మండల అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ఉన్న గొప్ప సిద్ధాంతకర్త జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా వినిపించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని శాస్త్రీయంగా, చారిత్రకంగా ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం అంకితమైందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జయశంకర్ సార్ కన్న కలలను భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కేసీఆర్ నాయకత్వంలో సాకారం చేశారని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం జయశంకర్ సార్ చూపిన మార్గంలోనే బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ముందుకు సాగుతుందని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ చేసిన సేవలు, ఆయన త్యాగం, ఆలోచనా విధానం నేటి తరాలకు ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన దారిలో నడిచి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతి కృష్ణమూర్తి, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, కూనూరు అశోక్ గౌడ్, ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు, మాజీ ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, సప్పిడి రామ్ నర్సయ్య, కోనేరు నాగేష్, తాటి కృష్ణ, కర్రె రవీందర్, దడుగల సమ్మయ్య, దన్నపునేని కిరణ్, ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, దొడ్డ కృష్ణ, కుమ్మరి చంద్రబాబు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కావిరి చిన్ని కృష్ణ, గండేపల్లి నర్సయ్య, ఈసం స్వరూప, సంఘం లక్ష్మి, బెడిక రమేష్, లక్ష్మయ్య, కొండగొర్ల తిరుపతి, మాదరి చంద్రమౌళి, కన్నెబోయిన రాజు యాదవ్, బట్టు గోపి, ఎస్.కె. అజ్మత్ పాషా, తాళ్లపెల్లి మోహన్, ఎస్.కె. బాబా, వావిలాల ముత్తయ్య, కొండాయి చిన్ని, కాళ్ల రామకృష్ణ, గార ఆనందు, మందపల్లి చంద్రం, ఏంపెల్లి రాజు, గండేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డీఆర్ఓ,ఆర్డీవోలను మర్యాదపూర్వకంగా కలిసిన 'ట్రెసా' నూతన కార్యవర్గం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా నూతన అధ్యక్షులు మేకల రాజ్ ప్రకాష్ నేతృత్వంలోని కార్యవర్గ బృందం గురువారం జిల్లా రెవెన్యూ అధికారి,భూపాలపల్లి మరియు కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారులను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 'ట్రెసా' జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ రజాక్,అసోసియేట్ ప్రెసిడెంట్లు ఎస్‌కే అబ్బాస్, ఎ. నాగరాజు, జె. నరేష్ కుమార్, టి. సాగర్, సువర్ణ, కోశాధికారి పి. రాజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి. ఉదయ్ కుమార్, బి. సతీష్, క్రీడా-సాంస్కృతిక కార్యదర్శి పి. రమేష్, సంయుక్త కార్యదర్శులు ఎన్. శ్రీనివాస్, బి. వెంకటేష్, ఎస్. శ్రీనివాస్, మౌనిక, ఈసీ సభ్యులు రెహ్మత్ ఫాషా, అశోక్, వేణు, పవన్ కుమార్, శివరామకృష్ణ, బి. శ్రీనివాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



# "హర్ ఘర్ తిరంగా"ను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి : డా.చందుపట్ల కీర్తి రెడ్డి



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

దేశభక్తి భావాన్ని ప్రతి ఇంటికి చేర్చే మహత్తర కార్యక్రమమే "హర్ ఘర్ తిరంగా" ఉద్యమమని,దీనిని విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు ముందుండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.చందుపట్ల కీర్తి రెడ్డి పిలుపునిచ్చారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఉద్యమం జాతీయ చైతన్యాన్ని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయడం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని,దేశం పట్ల మనకున్న గౌరవం,కర్తవ్యమని అన్నారు.జిల్లాలో తిరంగా యాత్రలు,ఇంటింటా జాతీయ పతాక ఆవిష్కరణలను దిగ్విజయం చేయడానికి నాయకులు,కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాద్ రావు,జన్నే మొగిలి,ఎరుకల గణపతి,కౌన్సిలర్ కన్నం యుగదీశ్వర్,కార్యక్రమ కన్వీనర్ దాసరి తిరుపతి రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్,తాటికొండ రవికిరణ్,పెండాల రాజు,వివిధ మోర్చాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆదివాసి హక్కుల పరిరక్షణే తుడుం దెబ్బ లక్ష్యం -- 30వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

- జల్--జంగిల్--జమీన్ కోసం పోరాటం కొనసాగుతుంది -- చట్టాలను నిర్వీర్యం చేస్తే ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని డిమాండ్
- కొమురం భీం ఆశయాల సాధనకు తుడుం దెబ్బ ఉద్యమం మరింత బలోపేతం చేయాలని పిలుపు







**తెలుగు గళం గోవిందరావుపేట, ములుగు :**

ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణ లక్ష్యంగా 1996 ఆగస్టు 6న ఆవిర్భవించిన ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ సంస్థ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర గ్రామంలోని కొమురం భీం విగ్రహం వద్ద వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా గోవిందరావుపేట మండల ప్రధాన కార్యదర్శి చింత వెంకటప్రసాద్ తుడుం దెబ్బ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు పొదెం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, జల్--జంగిల్--జమీన్ కోసం తన ప్రాణాలను అర్పించిన ఆదివాసి వీరుడు కొమురం భీం ఆశయాలను కొనసాగించడం ప్రతి ఆదివాసి బాధ్యత అని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడేందుకు అమల్లోకి వచ్చిన జీవో నెం.3, 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల చట్టం--2006 వంటి కీలక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, షెడ్యూల్ ప్రాంతాల చట్టాలను గౌరవించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ సమాజం ప్రభుత్వాలపై ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలను మరింత ఉద్ధృతం చేయడం తప్ప మరో మార్గం ఉండదని హెచ్చరించారు. తుడుం దెబ్బ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఆదివాసీ గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంజ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం సురేష్, జిల్లా నాయకులు పెండకట్ల బాలరాజు, జగ్గారావు, మండల నాయకులు రాంబాబు, నేతాజీ, చెరుకుల జితేందర్, నాలి రంజిత్, పెండకట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 30 వసంతాల తుడుందెబ్బ -- చలో ఐటీడీఏ ఏటూరునాగారం ముట్టడికి శంఖారావం

కొమరం భీం ఆశయాలతో ముందుకు తుడుందెబ్బ -- ఆవిర్భావ వేడుకల్లో ఆగస్టు 17

ఐటిడిఏ ముట్టడి కరపత్రాల విడుదల

ఆదివాసీ హక్కుల సాధన కోసం ఉద్యమాల బాట

-- తుడుందెబ్బ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా



**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**



ఆదివాసీల హక్కుల పరిరక్షణ, స్వయం ప్రతిపత్తి, రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం 1996 ఆగస్టు 6న ఆవిర్భవించిన తుడుందెబ్బ సంస్థ నేటితో (ఆగస్టు 6, 2026) 30 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వై జంక్షన్ వద్ద తుడుందెబ్బ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, సంస్థ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా తుడుందెబ్బ ఆదివాసీల భూమి, అడవి, నీటి హక్కులు, ఐదో షెడ్యూల్ అమలు, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ ఆదివాసీల గొంతుకగా నిలిచిందని పేర్కొన్నారు. కొమరం భీం ఆశయాలైన "జల్--జంగల్--జమీన్" సిద్ధాంతంతోనే సంస్థ ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం ఆగస్టు 17, 2026న నిర్వహించనున్న "చలో ఐటీడీఏ -- ఏటూరునాగారం ముట్టడి" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం, పెండింగ్ డిమాండ్ల సాధన, రాజ్యాంగబద్ధ హక్కుల అమలు కోసం నిర్వహించే ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు, యువతకు, మహిళలకు, అన్ని ఆదివాసీ సంఘాలకు పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని, తుడుందెబ్బ ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, కార్యదర్శి వట్టం జనార్దన్, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మీకాంత, జిల్లా అధ్యక్షురాలు పొలిశెట్టి అనసూర్య, మండల అధ్యక్షులు తాటి నీలాద్రి, ఉపాధ్యక్షులు కోరం సుధాకర్, పూనెం నాగేశ్వరావు, చింత లక్ష్మణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

శీలం సత్యనారాయణ రెడ్డి సిపిఎం డివిజన్ కార్యదర్శి



**సత్తుపల్లి,ఆర్ సి ఆగస్టు 6,తెలుగుగళం:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రావి వీరవెంకయ్య భవన్‌లో కే. రమణ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని, నేడు అదే స్ఫూర్తితో కార్మికుల హక్కులు, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక భద్రతను కాపాడుకునేందుకు జాతీయ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, విద్యుత్ సవరణలు, విత్తనాలకు సంబంధించిన విధానాలు, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు, బీమా రంగంలో విదేశీ మరియు ప్రైవేట్ పెట్టుబడులకు అధిక ప్రాధాన్యం కల్పించడం వంటి నిర్ణయాలు ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ఈ విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగి, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పగించే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ మాట్లాడుతూ, జాతీయ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 10న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, మొరంపూడి వెంకట్రావు, రమణ, చావా రమేష్, బండి వేలాద్రి, చెరుకు శ్రీనివాస్, మట్టపరి సత్యనారాయణ, కుమార్, ఎలగం రాములు, వలి, రఫీ, సంపత్, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, నాగేంద్ర, షకీన, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.